క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం: మండలంలో దార్లపూడి 1, లింగరాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. దార్లపూడిలో ఎంపీడీవో బృందం, లింగరాజుపాలెంలో తహసీల్దార్ బృందం హాజరవుతారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారని సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని చెప్పారు.

జగనన్న సురక్ష నేడు

కోటవురట్ల: మండలంలోని పి.కె.పల్లి, తంగేడు గ్రామాలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏవో చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని తెలిపారు. పి.కె.పల్లిలో తహసీల్దారు జానకమ్మ బృందం, తంగేడులో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు బృందం కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

చోడమాంబిక అమ్మవారి సన్నిధిలో యోగి రాజ్ స్వామీజీ


అమ్మవారిని దర్శించుకున్న యోగి రాజ్ స్వామీజీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారిని అవధూత యోగి రాజ్ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ ఆలయం మరింత ప్రసిద్ధి చెందుతుందని, ఇక్కడి వాతావరణం చాలా బాగుందని అన్నారు.ఈ కార్యక్రమంలో లాలం సత్తిబాబు, కె.ఆర్.కె రాజు,కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గూండ్రుబిల్లి ఉప సర్పంచిగా రాజేశ్వరి


రాజేశ్వరి మాణిక్యాలరావు దంపతులను అభినందిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: మండలంలో గూండ్రుబిల్లి గ్రామ ఉప సర్పంచిగా యలమంచిలి రాజేశ్వరి గురువారం ఎన్నికైనట్టు ఎంపీపీ బోదెపు గోవింద్ తెలిపారు. గూండ్రుబిల్లి గ్రామంలో గతంలో సర్వసిద్ది జ్యోతి ఉప సర్పంచ్‌గా పనిచేయగా పదవీకాలం 2 సంవత్సరాలు ముగియడంతో గ్రామంలో 8వ వార్డు మెంబరు అయిన యలమంచిలి రాజేశ్వరికి ఒప్పందం ప్రకారం అధికారికంగా ఎన్నికల సిబ్బంది ఆధ్వర్యంలో ఉప సర్పంచిగా ఎన్నికయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


గంగాదేవిపేటలో 104 శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక: ప్రతి ఒక్కరూ సీజన్‌లో ఆరోగ్య సూత్రాలు పాటించాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవి కోరారు. గంగాదేవిపేటలో గురువారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆమె సందర్శించారు. వర్షాకాలంలో రోగాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో వైద్యాధికారులు యామిని, రమణి వైద్య సేవలందించారు. ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగ

రాంబిల్లి: మండలంలో వై.లోవ గ్రామంలో మరిడిమాంబ, రాజారాయుడుపాలెం గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

822 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే

యలమంచిలి: జగనన్న సురక్ష ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక అని యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. గురువారం యలమంచిలి ఎస్సీ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 822 మంది లబ్ధిదారులకు ఆయన డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. 11 రకాల సేవల ద్వారా ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతోందని ప్రతి ఒక్కరు విధిగా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అర్బన్ మార్కెట్‌లను ప్రజలు వినియోగించుకోవాలి

ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న అర్బన్ మార్కెట్‌లను పట్టణ ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. గురువారం ఆయన యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో 45 ఎస్సీ సంఘాలతో ఏర్పాటు చేసిన 52 రకాల ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను పట్టణాల్లో ఏర్పాటు చేస్తుందని, రానున్న రోజుల్లో ఎస్సీలు మరింత అభివృద్ధి చెందే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీటి నిర్వహణ అప్పగించారని అన్నారు. అర్బన్ మార్కెట్‌ల ద్వారా ప్రజలకు సరసమైన ధరలతో గృహోపకరణ, అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి రానున్నాయన్నారు.

భూ సర్వేతో ప్రజల కష్టాలు తీరాయి

జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా రీసర్వేతో రాష్ట్రంలో ప్రజల భూ కష్టాలు తీరాయని ఎమ్మెల్యే అన్నారు. గురువారం పట్టణంలో సమగ్ర జగనన్న రీ సర్వే యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపాలిటీలో 25 వార్డుల్లో జగనన్న భూ సర్వే సమగ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచనలు అందజేశారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, కౌన్సిలర్లు ఒగిబోయిన చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి, మెప్మా అధికారిణి పద్మావతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో అంగన్‌వాడీలకు సొంత భవనాలు

ఎమ్మెల్యే బాబూరావు


నక్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు


చినదొడ్డిగల్లులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నక్కపల్లి: నాడు-నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడం జరుగుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. గురువారం నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వెదుళ్లపాలెం గ్రామాల్లో సుమారు రూ.48 లక్షల వ్యయంతో నిర్మించే అంగన్‌వాడీ భవనాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పీహెచ్‌సీలకు నాడు-నేడు పథకం ద్వారా పక్కా భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సచివాలయ, ఆర్‌బీకేలకు కూడా పక్కా భవనాలు నిర్మించి కార్యకలాపాలు ప్రారంభించడం జరిగిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో జగనన్న ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థను, ఆర్‌బీకేలను ఇతర రాష్ట్రాలు స్ఫూర్తిగా తీసుకుని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, వెదుళ్ల రమణ, బి.ఆనందరావు, ఎంపీటీసీలు తోట సత్తిబాబు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ తాతబాబు, ఉపసర్పంచ్ వీసం రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శీరం నర్సింహమూర్తి, గోవిందు, బంగార్రాజు పాల్గొన్నారు.

ఘనంగా పసుర మారమ్మ పండగ


వేమగిరిలో పసుర మారమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం: తొలకరి వచ్చిందంటే రైతులు వ్యవసాయ పనుల్లో బీజీ అవుతారు. ఆ తరుణంలో మండలంలో జేవీపాలెం, వేమగిరి, సైతారుపేట తదితర గ్రామాల వారు పసురమారమ్మ తల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గురువారం పసుర మారమ్మతల్లి జాతరను రైతులు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి తరలి వచ్చి పూజలు నిర్వహించారు. తొలకరిలో ఈ అమ్మవారి పండగ నిర్వహిస్తే వర్షాలు బాగా కురిసి పంటలు పండుతాయని రైతుల నమ్మకం. ఉత్సవం పేరుతో పాడి పశువులను శుభ్రపరచి పిండివంటలతో తయారు చేసిన ప్రసాదాలు తినిపించి సంతోషిస్తారు. మరికొంత మంది రైతులు నారుమడులు సిద్ధం చేసే ప్రాంతంలో భూమి పూజ నిర్వహించి వేడుకుంటారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక


నాగదుర్గ


కర్రి లహరి


సత్యపావని


బిందు


జక్కా ఆదిత్య

నక్కపల్లి: ట్రిపుల్ ఐటీకి మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ట్రిపుల్ ఐటీలో ఉన్నత చదువుకు అవకాశం కల్పిస్తారు. 2023 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు ఈ ఏడాది ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ చదువుకునే అవకాశం దక్కించుకున్నారు. గొడిచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ వెంకట దుర్గ (580), కర్రిలహరి(576), జక్కా ఆదిత్య(564) మార్కులతో ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా నక్కపల్లి బాలికోన్నత పాఠశాలలో చదివిన బి. సత్యపావని (575), గుత్తకాల బిందుద (566) మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ తెలిపారు. వీరంతా నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలులతో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో చదివేందుకు ఎంపికయ్యారన్నారు. వీరిని ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఎంఈవో గ్రామస్తులు అభినందించారు.

పాటిపల్లి నుంచి ముగ్గురు...

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. కె.సౌజన్య(నూజివీడు), ఎ.రజనీశ్వరి(శ్రీకాకుళం), ఎం.జయవర్దన్ (ఒంగోలు) ఐఐఐటీలో స్థానం సాధించారన్నారు. తమ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపిక కావడం సంతోషకరంగా ఉందన్నారు. ఇందుకు కారకులైన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

ఉమ్మలాడలో జగనన్న సురక్ష సర్వే


ఉమ్మలాడలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న దృశ్యం

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ అన్నారు. ఉమ్మలాడలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. అర్హులై ఉండి ఇంతవరకు ప్రభుత్వ పథకాలు దక్కనివారికి ఈ జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అలాగే 11 రకాల సేవలందుతాయన్నారు. ఇంటింటా సర్వేకు వచ్చే వలంటీర్లకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సూరిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిశెట్టి రామకృష్ణ, వలంటీర్ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నాయి.

అణుకు గిరిజనుల వినూత్న నిరసన


డోలీ మోస్తూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోటవురట్ల: స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా డోలీ మోత తప్పదా అంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అణుకు గిరిజన గ్రామానికి రహదారి నిర్మించాలని, గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో వారం రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. గురువారం ఏడవరోజు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ గ్రామం నుంచి మెయిన్‌రోడ్డు వరకు రాళ్లతో నిండి ఉన్న రోడ్డులో డోలీలు మోస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో కీటక నాశిని పిచికారీ


పాఠశాలలో కీటక నాశిని ద్రావణం పిచికారీ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.వరహాలరావు అన్నారు. లింగరాజుపాలెం జ్యోతిరావుపూలే పాఠశాలలో కీటక నాశిని ద్రావణం పిచికారి గురువారం చేశారు. విద్యార్థినులకు సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ఉచితంగా మందులు అందించారు. అనంతరం పరిసరాల్లో కీటక నాశిని పిచికారీ చేశారు. భోజనశాల, మరుగుదొడ్ల వద్ద సిబ్బంది పాటించాల్సిన నియమాలు వివరించారు.

డిప్యూటీ సీఈవో ఆకస్మిక తనిఖీ


జెడ్పీ నిధులతో వేసిన గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: సచివాలయ సిబ్బంది కేటాయించిన సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. ఆయన గురువారం ఆకస్మికంగా మండల కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా పరిషత్ నిధులతో కొరుప్రోలు జగనన్న లేఅవుట్‌కి రూ.10 లక్షలతో వేసిన గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. కాలనీకి అవసరమైన రోడ్డు ముందుగా వేయడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్త పరచారు. అనంతరం తడిపొడి చెత్తల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి వినియోగంలోనికి తీసుకురావాలని సూచించారు. ఈ కేంద్రం నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతకు ముందు సచివాలయానికి వచ్చిన డిప్యూటీ సీఈవో రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, ఇన్‌చార్జ్ మండల ఏఈ దుర్గాశంకర్ పాల్గొన్నారు.

అరబుపాలెంలో పర్యటన

మునగపాక: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ కోరారు. అరబుపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన రహదారులను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా హరిపాలెం మరిడిమాంబ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపు సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు అధికారులు ఎంత వరకు పరిష్కరించారనే నివేదికతో సమావేశానికి తీసుకురావాలన్నారు. సర్వసభ్య సమావేశానికి ప్రధాన అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

నిల్వ నీటితో విషజ్వరాలు

రాంబిల్లి: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్ సూచించారు. గోకివాడ గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. నిల్వ నీటిలో దోమలు విస్తరించి, డెంగ్యూ, మలేరియా సోకుతాయన్నారు. ఎంపీహెచ్‌ఈవో రాజు , ఆరోగ్య పర్యవేక్షకురాలు ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్, పవన్ యాక్షన్

- వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే కన్నబాబురాజు


పాటిపల్లిలో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: ప్రజలకు నిస్వార్థమైన సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్‌కల్యాణ్ నటిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పాటిపల్లి,రాజుపేట సచివాలయాల్లో ఆయన అర్హులైన నిరుపేదలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా నేడు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ వ్యవస్థను దేశంలో అందరూ మెచ్చుకుంటుంటే ఇది చూసి ఓర్వలేక చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ కల్యాణ్ విమర్శలు చేయడం బాధాకరమన్నారు. లోపాలను ఎత్తి చూపాల్సింది పోయి వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా చంద్రబాబు,పవన్‌లకు గుణపాఠం చెప్పి జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వాదం అందించాలన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, నారాయుడుపాలెం సర్పంచ్ కిలాడి దేముడు, కోరుకొండ వెంకటి, ఎంపీటీసీ శిరీషా, సచివాలయాల కన్వీనర్లు కొయిలాడ జగదీష్, సరిసా శ్రీను,ధనశ్రీను,ఎంఎల్‌వో సంజయ్,డీఎల్‌డీవో మంజులావాణి,ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ ప్రకాశరావు పాల్గొన్నారు.

వలంటీర్లను విమర్శించడం తగదు


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ఎంపీపీ కోన సంధ్య, సుకుమారవర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని, సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లను విమర్శించడం సరికాదని యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పెదపాడు,ఖాజీపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు నిస్వార్థంగా పనిచేస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధృవీకరణ పత్రాలు ప్రజల ఇంటి వద్దే అందుతున్నాయని తెలిపారు. వలంటీర్ల సేవలను డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ కొనియాడారు. ఎంపీపీ కోన సంధ్య, కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జడ్పీటీసీ నర్మాల కుమార్,మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసరావు,ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాబూరావుని కలసిన బొడ్డేడ


ఎమ్మెల్యేను సత్కరిస్తున్నబొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను కలిసి దుస్సాలువాతో సత్కరించారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మునగపాకలో ఆరోగ్య సర్వే


ఆరోగ్య సర్వే చేపడుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక: మండల కేంద్రంలో గురువారం 6వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలతో పాటు క్షేత్రస్థాయిలో అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. బీపీ,సుగర్,ఎత్తు, బరువులను పరీక్షించారు. మండలానికి ఒక గ్రామాన్ని సర్వేకు ఎంపిక చేశారు.దీనిలో భాగంగా మునగపాక గ్రామాన్ని ఎంపిక చేసిన అధికారుల బృందం స్థానిక సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. ప్రతీ సర్వే అధికారికి 22 ఇళ్లను కేటాయించారు. సిగ్మా రీచెర్స్ సంస్థ టీమ్‌లీడర్ ఆర్.తారకాచారి నేతృత్వంలో ఏడుగురు సభ్యుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్న బృందానికి మునగపాక పీహెచ్‌సీ సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎం.ఉమామహేష్, ఏఎన్‌ఎం దేవకి తదితరులు సహకరించారు.

జగనన్న ప్రభుత్వంలోనే పట్టణాభివృద్ధి


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా.

యలమంచిలి: పట్టణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా అన్నారు. యలమంచిలి పట్టణంలో పరమేశ్వరి థియేటర్ వద్ద నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో కారం మిల్లు వరకు రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సహకారంతో యలమంచిలి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరయ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి ద్వారా జంగిల్ క్లియరెన్సు

కోటవురట్ల: వర్షాకాలం రావడంతో రోడ్లకిరువైపులా పిచ్చిమొక్కలు మరింత ఏపుగా పెరిగిపోతున్నాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఎమ్మార్సీ, పీఆర్, పశు వైద్యశాల, భవిత భవనం, స్త్రీశక్తి భవనం, సమావేశ మందిరం, ఆర్బీకే, హౌసింగ్ కార్యాలయం, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, గ్రంథాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, పౌర సరఫరా గిడ్డంగి ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా పాములు సంచరిస్తున్నాయి. పలువురి ఫిర్యాదుతో అధికారులు గురువారం జంగిల్ క్లియరెన్సు చేపట్టారు. ఉపాధి కూలీలతో ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించే పని ప్రారంభించారు.

వర్షాలకు చిత్తడిగా మారిన రహదారులు


బురదమయమైన దారికి అడ్డంగా కంచె వేసిన స్థానికులు

కోటవురట్ల: ప్రస్తుత వర్షాలకు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారిపోయాయి. పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మట్టిరోడ్డులు కావడంతో బురదతో దారుణంగా తయారయ్యాయి. నాలుగు రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. చిరు జల్లుల నుంచి కుండపోతగా కూడా కురుస్తున్నాయి. దాంతో అన్నవరం, అల్లుమియ్యపాలెం, కోదండరాంపురం, తడపర్తి గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అన్నవరం జంక్షన్‌లో మట్టిరోడ్డు కావడంతో వర్షాలకు దమ్ము పట్టిన పొలాన్ని తలపిస్తోంది. వాహనచోదకులు జారిపడుతున్నారు. దాంతో స్థానికులు తాత్కాలికంగా వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డుగా కంచె వేశారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.